ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 15 సంచిక : 03 నవంబర్ 2009

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 24
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రు॥150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

జిన్నూరు ............ 13-09-09
హైదరాబాద్ ........ 23-09-09
జిన్నూరు ............ 19-10-09

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 13-09-2009, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ ప్రవచనాలు ఏదో కాలక్షేపం కోసం మేము చెప్పటంలేదు. మీరు అందరూ తరించాలి, మీరు ఆత్మసుఖాన్ని పొందాలి, ఆత్మసుఖం మీకు అనుభవంలోనికి వచ్చేవరకూ పునర్జన్మలు తప్పవు. ఆచార్యులవారు వివేక చూడామణిలో జ్ఞానిగురించి చెపుతూ ఏమన్నారు అంటే ఇంద్రియాల తోటి, మనస్సుతోటి, దేహంతోటి, ప్రపంచంతోటి సంబంధం లేకుండా వాడు ఆత్మసుఖాన్ని పొందుతూ ఉంటాడు, వాడి వెనకాల జనం లేకపోయినా, వాడు ఒక్కడే ఉన్నా, వాడు ఎక్కడ ఉన్నా కూడా మహాబలవంతుడుగా ఉంటాడు. మనం ఆ స్థితిని పొందాలి. ప్రతీవాడికి ఎవడి దేహం అంటే వాడికి ఇష్టం. మీ తల్లితండ్రులు మిమ్మల్ని ప్రేమిస్తున్నారు, మీరు మీ తల్లితండ్రులను ప్రేమిస్తున్నారు, ఈ ప్రేమలు నిజంకాదు. మీరు ఏదో బాగా చూస్తారని వారు, వారు ఏదో బంగారం, డబ్బు పడేస్తారు అని మీరు ఇలా స్వార్థంతో ఇవి అన్నీ చేస్తున్నారు. లోకం అంటే ఇలాగే ఉంటుంది. నేను ఉన్నాను అని బైబిలులో చెప్పాడు, దానిని మనం అందుకోవాలి. నేను ఉన్నాను అని మనం అనుకొంటున్నాము కదా. నువ్వు నిజంగా ఉంటే మరి దేహం పోయినప్పుడు నేను పోతున్నాను అని ఎందుకు అనుకొంటున్నావు. ఆ ఉండేది దేహము పోయినప్పుడు అది పోదు. అయితే ఇప్పుడు నీకు ఈ దేహం, ఇంద్రియాలు, మనస్సు అనుభవంలో ఉన్నాయి కాని ఆ వస్తువు నీకు అనుభవంలో లేదు. అది ఎప్పుడూ ఉంటుంది. అక్కడిదాకా ఎందుకు, ఇప్పుడు మనకు గాఢనిద్రలో దేహం గొడవ లేదు, మనస్సు గొడవ లేదు, దేవుడి గొడవ లేదు, పూజలు జపాలు మంచి చెడ్డ ఈ గొడవ ఏమీ లేదు కాని మనం ఉన్నాము కదా,

ఆనందంగా ఉన్నాముకదా. ఆ స్థితిని మీరు పొందాలి, అదీ సాధన యొక్క గమ్యం.

మమకారం విడిచిపెట్టేయండి, మమకారం విడిచిపెట్టేయండి అని లోకంలో చాలామంది చెపుతూ ఉంటారు కాని మహాత్ములపట్ల, మహర్షులపట్ల, సజ్జనులపట్ల మమకారం విడిచిపెట్టవద్దు అని భాగవతంలో చెప్పాడు. మహాత్ములపట్ల, మహర్షులపట్ల మమకారం విడిచిపెట్టేస్తే మీరు నష్టపోతారు. వారితో మమకారం పెట్టుకోవటం వలన వారికి ఏమీలాభం లేదు కాని మనకు ఎలా లాభం అంటే మల్లెపువ్వుల చెట్టు దగ్గర కూర్చుంటే మనకు మల్లెపూవులు వాసన వస్తూ ఉంటుంది అలాగే మహాత్ముల సమక్షంలో వారి వైబ్రేషన్స్ మనమీద పనిచేయటం వలన మహాత్ముల హృదయంలో ఏదైతే ఉందో, అదే మన హృదయంలో కూడా ఉంది, వారి హృదయంలో ఉన్న వస్తువు వారికి తెలుస్తోంది కాని మన హృదయంలో ఉన్నది మనకు తెలియటం లేదు, దానిని మనం తెలుసుకోవాలి అనే బుద్ధి మహాత్ముల సమక్షంలో మనకు కలుగుతుంది అని భాగవతంలో ఉంది. ఏదో ఒక దీపం వెలుగుతూ ఉంటే దానిని బట్టి మీ దీపాలు కూడా వెలిగించుకోవచ్చు, అసలు దీపం లేకపోతే మనం ఎలా వెలిగించుకొంటాము. మహాత్ములతో సహవాసం వలన మీ సాధనతో సంబంధం లేకుండా మీకు సుఖం, శాంతి వస్తాయి. కొంతమందికి ఎక్కువ స్వార్థం ఉంటుంది, క్రూరత్వం ఉంటుంది, అటువంటి వారితో సహవాసం వలన పరిణామంలో దుఃఖం, అశాంతి వస్తాయి. అందుచేత మహాత్ములతో, సజ్జనులతో సహవాసం విడిచిపెట్టవద్దు, అవసరమైతే వారితో మమకారం పెంచుకో, దానివలన నువ్వు పవిత్రుడవు అవుతావు, నీలో జ్ఞాననేత్రం తెరువబడుతుంది.

ఊరక ఉండటం భగవాన్‌కు ఇష్టం. భగవాన్ ఆయన జీవితంలో ఏ విషయం గురించీ అది మంచి అయినా, చెడ్డ అయినా సరే దేనికీ ఆయన ఆశ్చర్యపడలేదు. ఆయన ఉద్దేశ్యం ఏమిటి అంటే ఈ దేహం ప్రారబ్ధం అనుభవించటానికి వచ్చింది. పుణ్య ప్రారబ్ధం ఉంటే రోజులు సుఖంగా వెళ్ళిపోతాయి, పాపప్రారబ్ధం ఉంటే దుఃఖం వస్తుంది అంటే పుణ్యం సుఖరూపంలో ఖర్చు అయిపోతుంది, పాపం దుఃఖరూపంలో ఖర్చుఅయిపోతుంది, దానిని నువ్వు ఆపుచెయ్య లేవు. ఏ ప్రారబ్ధం అనుభవించటానికి ఆ శరీరం భూమి మీదకు వచ్చిందో అది పూర్తి అయిన వెంటనే ఆ శరీరం చనిపోతుంది. ఈ లోపులో మనం ఆశ్చర్యపడటం ఎందుకు? అయ్యో అది అలా జరిగింది, ఇది ఇలా జరిగింది అని అనుకోవటం నోరు నొప్పి అని చెప్పారు. ప్రారబ్ధాన్ని బట్టి శరీరం అలా ఆడుతుంది, చనిపోతుంది అంతే అన్నారు. మనం ఎంత కంగారుపడ్డా ఆ దేహం ద్వారా జరుగవలసి ఉంటే దానిని మనం ఆపుచేయలేము. జరుగరానిది ఉంటే

దానికోసం మనం ఎంత కష్టపడి పనిచేసినా అది జరుగదు. ఈలోపుగా మనం తలకాయపోటు తెచ్చుకోవటం వలన, కంగారుపడటం వలన ఏమీ ప్రయోజనం లేదు. జరుగవలసింది జరిగే తీరును, జరుగరానిది ఎంత ప్రయత్నం చేసినా జరుగనే జరుగదు. అందుచేత ఊరక ఉండటం ఉత్తమం అన్నారు భగవాన్. భగవాన్ చెప్పిన దానికి ఇక్కడ ఒక ఉదాహరణ చెపుతాను. రావణాసురుడి క్షేమం కోరి, రావణాసురుడిని బతికించడానికి చాలామంది ప్రయత్నం చేసారు. మాయలేడి వేషం వేయమని మారీచుడి దగ్గరకు వెళ్ళినప్పడు మారీచుడు రావణాసురుడితో చెపుతాడు. సీతమ్మను తీసుకొని వెళ్ళటానికి నా దగ్గరకు వచ్చావు, నువ్వు పొరపాటు చేస్తున్నావు. రాముడు మానవమాత్రుడు అనుకొంటున్నావు, భగవంతుడే ఆ రూపంలో వచ్చాడని నీకు తెలియటంలేదు. నువ్వు రాజువు, నీ క్షేమం మేము కోరాలి. సీతమ్మను తీసుకొనివెళ్ళటం వలన నీవు సుఖపడవు. నువ్వు పాడవటం కాదు లంక అంతా కూడా పాడైపోతుంది, సీతమ్మ గొడవ నీకు వద్దు అని మంచిమాటలు చెపుతాడు. అప్పడు రావణాసురుడు వెళ్ళిపోతాడు. మనం ఒకరి దగ్గర పనిచేసేటప్పడు ఎప్పడూ వారి క్షేమం మనం కోరాలి, ఎవరితోటి అయినా స్నేహాలు చేసినప్పడు కూడా వారి క్షేమం మనం కోరాలి లేకపోతే అది స్నేహం ఎలా అవుతుంది, అది స్నేహం అవ్వదు, ద్రోహం అవుతుంది. సీతమ్మ నీ కోటలో ఉండాలి అని సూర్పణక రావణాసురుడిని రెచ్చగొడుతుంది. మరల రావణాసురుడు మారీచుడి దగ్గరకు వస్తాడు. అప్పడు కూడా మారీచుడు మంచి మాటలు చెపుతాడు. రావణాసురుడు మొదట వచ్చినప్పడు సత్వగుణంలో ఉన్నాడు అప్పడు మారీచుడి మాటలు విని వెళ్ళిపోయాడు. ఇప్పడు తమోగుణంతో వచ్చాడు. మాయ లేడి వేషం వేయకపోతే ఊరుకొనేలాగ లేడు. అప్పడు మారీచుడు తెలివితేటలు ఉపయోగించాడు. మాయలేడి వేషం వేసి వెళితే రాముడు చంపేస్తాడు, అలా వెళ్ళకపోతే రావణాసురుడు చంపేస్తాడు. ఒక దుర్మార్గుడి చేతిలో చనిపోవటం కంటే ఒక మహాత్ముడి చేతిలో చనిపోవటం మంచిది అని మాయలేడి వేషం ధరించి వెళ్ళాడు. ఎక్కడో రావణాసురుడి వరకు అక్కరలేదు, మనం అయినా అంతే. సత్వగుణంలో ఉన్నప్పడు చెపితే వింటాము అదే తమోగుణంలో ఉండగా చెపితే ఎంత మంచి చెప్పినా అది మీ బుర్రకు ఎక్కదు. రావణాసురుడికి విభీషణుడు కూడా చాలా మంచి విషయాలు చెపుతాడు కాని వాడు వినలేదు. విధి బలీయంగా ఉన్నప్పడు మనం ఎంత మంచి చెప్పినా అది ఫెయిల్ అవుతుంది, రావణాసురుడి జీవితమే కాదు ఎవరి జీవితం అయినా అంతే, రావణాసురుడు ఆ మంచిమాటలను ఎలా వదిలేసాడో అలాగే ప్రతి జీవుడు వదిలేస్తాడు, విధి ఆ మంచి మాటలను అతిక్రమించేలాగ చేస్తుంది.

వారు ఏదో చెడ్డ చేసారు, వీరు ఏదో చెడ్డ చేసారు, మనం మంచివారము అని చాలా మంది అనుకొంటూ ఉంటారు. మనం మానవజన్మలోనికి వచ్చాము. మనం ఇక్కడ చెయ్యవలసిన పనులు, చెయకూడని పనులు అని ఉంటాయి. చెయ్యకూడని పనులు మనం చెయ్యటం ఎంత పొరపాటో చెయ్యవలసిన పనులు చెయ్యకపోవటం కూడా అంతే పొరపాటు. మరణానంతరం జీవుడు నేను ఈ పొరపాటు చెయ్యలేదు, ఆ పొరపాటు చెయ్యలేదు అని యమధర్మరాజు దగ్గర అంటే ఆయన ఏమంటాడు అంటే సరే నువ్వు చేయకూడని పనులు చెయ్యలేదు, మరి చెయ్యవలసిన పనులు ఏమైనా చేసావా అని అడుగుతాడు అప్పడు ఈ జీవుడు నోరు వదిలేస్తాడు, వాడు ఏమైనా చేసి ఉంటే కదా చెప్పటానికి. నువ్వు చెయ్యవలసింది చేయాలి తరువాత జరుగవలసింది ఏదో జరుగుతుంది, అది ఈశ్వర నిర్ణయం. పరమాత్మ రాయబారానికి వెళ్ళినప్పడు కూడా కౌరవులు తమోగుణంలో ఉన్నారు, వారు నీ మాట వినరు, అందుచేత రాయబారానికి వెళ్ళటం అనవసరం అని చెపుతారు. అప్పడు పరమాత్మ ఏమని చెప్పాడు అంటే వారు వినరు అన్న సంగతి నాకు తెలుసు అయినా నా డ్యూటీ నేను చెయ్యటానికి వెళుతున్నాను అని చెప్పాడు. అలాగే మనం కూడా మన డ్యూటీ మనం చెయ్యాలి. నువ్వు దీపాన్ని చూడటానికి ఇంకో దీపం తీసుకొని వెళ్ళటం ఎందుకు అంటున్నారు భగవాన్. వస్తువు నీ లోపలే ఉంది, అది తనంతట తానుగా ప్రకాశిస్తోంది. దానిని తెలుసుకోవటానికి నువ్వు మనస్సును కాపాడుకోనక్కరలేదు, ఎప్పడైతే మనోనాశనం అయ్యిందో అప్పడు అది నీకు వ్యక్తమవుతుంది అంతేగాని దానిని తెలుసుకోవటానికి బయట సహాయం ఏమీ అక్కరలేదు. బాహ్యమైన సాధనలు ఇవన్నీ ఎందుకంటే నీకు దేహబుద్ధి తగ్గించటానికే. నీ దేహాన్ని ప్రారబ్దానికి వదిలేసి నీ పని ఏదో నువ్వు శ్రద్ధగా చేసుకొంటూ ఉంటే దేహబుద్ధి సహజంగానే పోతుంది. నువ్వు సంకల్పాలను విడిచిపెట్టు, నీ సంకల్పాలతోను, ఆలోచనలతోను సంబంధం లేకుండా జరగవలసింది జరుగుతూ ఉంటుంది. మనకు తలంపు లేకుండా, కోరిక లేకుండా ఆ పని అవ్వదేమో అని మనం అనుకొంటాము ఇక్కడే మనం ఫెయిల్ అవుతున్నాము. నీ తలంపుతో సంబంధం లేకుండా, కోరికతో సంబంధం లేకుండా మీ దేహం ఏ పని మీద అయితే వచ్చిందో దేహం ద్వారా ఆపని జరిగిపోతూ ఉంటుంది, మీ ప్రయత్నం ఏమీ లేకుండానే అది జరిగిపోతుంది.

మీ హృదయంలోనే శాంతి ఉంది, సుఖం ఉంది, ఆనందం ఉంది. నీ హృదయంలో ఉన్న శాంతి, సుఖం నీకు దొరుకుతూ ఉంటే ఇంక ఆనందంకోసం బయట తిరగవలసిన పని లేదు. నీ హృదయంలో ఉన్న శాంతిలో స్థిరపడిపోతే ఇంక నీ మనస్సు బయట గొడవలలోనికి

వెళ్లదు. నీ డ్యూటీ ఏదో నువ్వు చేస్తావు కాని ఆనందం కోసం పని చెయ్యవలసిన అవసరం లేదు. ఏదో వస్తుందని ఆశించిమటుకు పనిచెయ్యవు. నన్ను బ్రహ్మచర్యం అవలంభించ మంటారా అని ఒకరు భగవాన్‌ని అడిగారు. దానికి భగవాన్ ఏమన్నారు అంటే బ్రహ్మచర్యం అంటే బ్రహ్మంలో చరించటం, బ్రహ్మంలో నిలబడి ఉండటం, బ్రహ్మంలో చరించేవాడే బ్రహ్మచారి అని చెప్పారు. భగవాన్ మరణానుభవం ద్వారా బ్రాహ్మీస్థితిని పొందారు. మరణానుభవంలో మూడు దేహాలూ కాలిపోయినాయి. అంటే స్థూలదేహం, సూక్ష్మదేహం, కారణదేహం మూడూ కాలిపోయినాయి. స్థూలదేహం అంటే మాంసం, ఎముకలు, రక్తం. సూక్ష్మదేహం అంటే మనస్సు. కారణదేహం అంటే అజ్ఞానం. ఈ మూడు పోకుండా ఏ మనిషికి జ్ఞానం కలుగదు. ఈ అశాంతి ఎప్పడు పోతుంది, ఈ దుఃఖం ఎప్పడు పోతుంది అనుకొనేవాడు అజ్ఞాని. ఏది వచ్చినా మనోదేహములకే కదా, ఈ గొడవలన్నింటికి దేహము, మనస్సే కారణం. గాఢనిద్రలో ఉన్నప్పడు మనకు ఏ గొడవ లేదు. గాఢనిద్రలో మనకు దేహం గొడవ, మనస్సు గొడవ, లోకం గొడవ ఏ గొడవ లేదు. అందుచేత అక్కడ సుఖంగా ఉన్నాము, శాంతిగా ఉన్నాము. మీది ఏ ఊరు అంటే పాలకొల్లు అంటారు. పాలకొల్లుకి మీకు సంబంధం ఏమిటి? నీ దేహం ఎక్కడ పుడితే అది మీ ఊరు అనుకొంటున్నారు, అసలు దేహము నువ్వా? ఇక్కడే ప్రతివాడిని మాయ కమ్మేస్తోంది. మాయ అంతా తీసుకొని వచ్చి దేహము నేను అనే చిన్నతలంపులో పెట్టేసాడు. రవీంద్రనాథ్ ఠాగూర్ దేహాభిమానం గురించి ఒక ఉదాహరణ చెప్పాడు. ఒకడు బిందె తీసుకొని నదికి వెళ్లి నీరు తెచ్చుకొన్నాడు. ఆ నీరు నదిలోనివే కాని ఇంటికి తెచ్చుకొని ఆ నీళ్ళు నావి అంటున్నాడు. నదిలో నీరు ఉన్నప్పడు వాటితో తాదాత్మ్యం లేదు, ఆ నీరు ఇంటికి తెచ్చుకొన్నాక వాటితోటి తాదాత్మ్యం వచ్చేసింది. అలా తాదాత్మ్యం వచ్చినప్పడు కూడా ఆ నీరు నదివే. ఎంతమాయ అంటే నదిలో నీరు ఎలాపోయినా వాడికి అక్కరలేదు కాని వాడి బిందెలో నీరు మటుకు పోకూడదు. తాదాత్మ్యం వచ్చినప్పడు ఉన్నాయని, ఖర్చు అయిపోయినాయి అనిలెక్క వచ్చేస్తుంది. మనోదేహములతో తాదాత్మ్యం కూడా అటువంటిదే. ఈ మనస్సులు అన్నీ భగవంతుడిలో నుండే, హృదయంలోనుండే వచ్చినాయి. మీ మనస్సు వెళ్లి హృదయంలో పడిపోయింది అనుకోండి, నా మనస్సు వెళ్లి హృదయంలో పడిపోయింది అనుకోండి అక్కడ రెండుగా లేము, ఉన్నది ఒక్కటే.

అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాను అని పరమాత్మ చెప్పాడు. జీవుడు కూడా అక్కడ నుండే వస్తున్నాడు. అక్కడే వాసనలు కూడా ఉన్నాయి. వాసనలో నుండి తలంపు వస్తుంది. తలంపును బట్టి మాట్లాడతారు, తలంపును బట్టి పని చేస్తారు. ఈ జీవుడు ఎక్కడ

నుండి అయితే వచ్చాడో తిరిగి అక్కడకు జీవుడిని పంపటమే సాధన యొక్క గమ్యం. నువ్వు పొందవలసిన అనుభవాలు పొందేవరకూ ఒకోవాసన, ఒకోవాసన విడిచిపెడుతూ ఉంటాడు. మనలో ఏ వాసన ఉందో మనకు తెలియదు. ఈశ్వరుడు ఆ వాసనను విడిచిపెట్టినప్పడు ఆ వాసన మనకు తలంపు రూపంలో వస్తుంది. ఆ వాసన ఉందని అప్పడు మనకు తెలుస్తుంది. నువ్వు అంతర్దృష్టిని అలవర్చుకొని హృదయంలోనికి వెళ్లిపోతే నీ శరీరగతమైన యాత్ర ఆగిపోతుంది. అంటే జీవుడిని వాడి మూలమైన హృదయంలోనికి పంపాలి. ఆంజనేయస్వామి మాట్లాడుతూ ఉంటే భగవంతుడు ఆశ్చర్యపోయాడు. లోపల జీవుడు పరిశుద్ధుడు అయిపోయాడు అనుకోండి, పాపరహితుడు అయిపోయాడు అనుకోండి మీ చేతితో చేసేపని, మాట్లాడేమాట చాలా మృదువుగా ఉంటుంది, సౌందర్యంగా ఉంటుంది, దానిని మనం వర్ణించలేము. ఇతరులు చేసే పని నువ్వు కూడా చేయవచ్చు కాని ఆ పని వెనకాల శాంతి ఉంటుంది, ఆనందం ఉంటుంది. అది ఇతరులకు శాంతిని కలుగజేస్తుంది. ఓ హనుమంతా! నువ్వు పాపరహితుడవు, నీ అంతఃకరణం ఎంత పరిశుద్ధంగా ఉంది, పరిశుద్ధమైన అంతఃకరణానికి, నిశ్చలమైన అంతఃకరణానికి ఆత్మసుఖం అందకుండా ఎలా ఉంటుంది అంటాడు పరమాత్మ. కొంతమంది మనతో మాట్లాడుతూ ఉంటే కళ్ళు, చేతులు తిప్పేస్తారు, కళ్లనుండి ద్వేషం కక్కుతూ ఉంటారు. కొంతమంది ఇంటిలో దారిద్ర్యంగా ఉన్నా మనస్సులో మటుకు సంపన్నంగానే ఉంటారు. ఇంట్లో పేదరికం ఉన్నా, మనస్సులో ఎందుకు పేదరికంగా ఉండాలి అంటారు. నీ మనస్సులో దారిద్ర్యం లేకపోతే, నువ్వు మనస్సులో సంపన్నంగా ఉంటే నువ్వు భౌతికంగా ఇతరులకు ఏమి చేయలేకపోయినా, ఎప్పడూ వారిక్షేమం కోరుతూనే ఉంటావు.

మనస్సును హృదయంలోనికి పంపటానికే సాధనలు అన్నీ. మనస్సును హృదయంలోనికి పంపితే, మనస్సు తన మూలమైన హృదయంలో నిలబడితే అది కరిగిపోతుంది. మనస్సు హృదయంలోనికి జారుకుంటేనేగాని అసలు మనకు నిద్రపట్టదు. గాఢనిద్రలో మన మనస్సు సహజంగానే హృదయంలో ఉంటుంది. అక్కడ మన ప్రయత్నం ఏమీ లేదు. అలాగే మన ప్రయత్నంతో సంబంధం లేకుండా జాగ్రదవస్థలో మన మనస్సు హృదయంలో ఉంటే అప్పడు మనో నాశనం అవుతుంది, అక్కడ ఉన్న పరమాత్మ నీకు వ్యక్తమవుతాడు, మీరు ప్రాణాయామం చేయండి, మహాత్ములతో సహవాసం చేయండి, నిష్కామకర్మ చేయండి, ఈశ్వరుడిపట్ల భక్తి కలిగి ఉండండి, వీటిద్వారా మనస్సు యొక్క చాపల్యం ఎప్పడైతే తగ్గిపోయిందో అప్పడు మనస్సులో ఉన్న వాసనలు కూడా క్షయించటం ప్రారంభమవుతాయి. ఒక్క వాసన మిగిలి ఉన్నా అది పునర్జన్మలను తీసుకొని వచ్చేస్తుంది. మనస్సు శిరస్సులో ఉన్నప్పడు అది విజృంభిస్తూ

ఉంటుంది, హృదయంలోనికి వెళ్ళినప్పుడు అది కృశిస్తుంది. గాఢనిద్రలో మనస్సు హృదయంలో ఉండటానికి ఏమీ ప్రయత్నం అక్కరలేదు. జాగ్రదవస్థలో మనస్సును హృదయంలో ఉంచటానికి ప్రయత్నం అవసరం. మనం ప్రయత్నం చేస్తూ ఉంటే అది హృదయంలోనికి వెళుతూ ఉ ంటుంది, బయటకు వస్తూ ఉంటుంది. మనం ప్రయత్నం ఎంతవరకు చేయాలి అంటే మన ప్రయత్నంతో సంబంధం లేకుండా అది హృదయంలో స్థిరంగా ఉండేవరకూ మనం ప్రయత్నం చేయాలి. అప్పటివరకు మనం సాధన చేయవలసిందే. ఎవరైనా ఆపరేషన్ చేయించుకొంటున్నారు అనుకోండి ఆపరేషన్‌కు సంబంధించి అంతా ప్రిపేర్ చేసి చేయించుకొనే వ్యక్తిని ఆపరేషన్ రూము దగ్గరకు తీసుకొనివెళ్ళి లోపలకు గెంటేస్తారు. తరువాత అక్కడ ఉన్న డాక్టర్ ఆయన చేయవలసిన పని చేస్తాడు. బయట గురువు చేసే సహాయం ఏమిటి అంటే నీ మనస్సును లోపలకు గెంటుతాడు. నిజమైన గురువు లోపలే ఉన్నాడు. నీ మనస్సు లోపలకు వెళ్ళాక ఆయన చేయవలసిన సర్జరీ అంతా ఆయన చేస్తాడు. సర్జరీ చేయాలంటే అసలు ఈ పేషంట్ డాక్టరుగారి చేతికి అందాలికదా. ఆ పేషంట్ డాక్టరుగారికి అందకుండా పారిపోతే ఆయన ఏమి చేయగలడు. అంటే బయట గురువు చేసేపని ఏమిటి అంటే నీ మనస్సును ప్రిపేర్ చేసి లోపలకు గెంటి లోపల ఉన్న నిజమైన గురువుకి అందేలా చేస్తాడు, నీ మనస్సు ఎప్పుడైతే ఆయన చేతికి దొరికిందో దానిని లోపలకు లాగేసుకొని ఆ మనస్సును కత్తిరించి ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు, వాడు గురువు. లోపల ఉన్న నిజమైన గురువే నీ కోసం ఒక రూపం ధరించి వస్తాడు. నీతో కలిసి తిరుగుతాడు, నీతో మాట్లాడుతాడు, నీ క్షేమ సమాచారాలు అడుగుతాడు. ఇలా ఏది చేసినా నీ మనస్సును హృదయంలోనికి తీసుకొనిపోవటమే ఆయన గమ్యం, మిగతావి అన్నీ తాత్కాలికం, స్వప్న సమానం. ఈ సృష్టి ఎంతకాలం అయితే ఉందో అంతకాలం జీవకోటి అలా వస్తూ ఉంటారు, పోతూ ఉంటారు. నిన్ను నీవు ఉద్ధరించుకోవటం మానేసి, నిన్ను నీవు బాగుచేసుకోవటం మానేసి ఈ లోకాన్ని ఎలా ఉద్ధరించాలి అని ఆలోచిస్తావు, అదే మాయ. నువ్వు పుట్టకముందు ఈ లోకాన్ని ఎవడైతే చూసాడో, నువ్వు చనిపోయిన తరువాత కూడా వాడే ఈ లోకాన్ని చూసుకొంటాడు. మధ్యలో నువ్వు ఎవడివి ఉద్ధరించడానికి. ఈ లోకానికి ఒక ప్రభువు ఉన్నాడు, అంతా ఆయనే చూసుకొంటాడు. నువ్వు బాగుపడుతున్నావు అనుకో నిన్ను చూసి వాడు బాగుపడ్డాడు మనం కూడా బాగుపడాలి అనే బుద్ధి ఇతరులకు కలుగుతుంది. మీరు సత్కర్మ చేస్తున్నారు అనుకోండి, మీరు ఎవరితోటి సత్కర్మ చేయమని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. మిమ్మల్ని చూసి వారు సత్కర్మ చేస్తున్నారు మనం కూడా చేద్దాము అనే బుద్ధి ఇతరులకు కలుగుతుంది.

మహాత్ములు, సత్పురుషుల పట్ల మమకారం విడిచిపెట్టవద్దు, వారితో తాదాత్మ్యం వదులుకుంటే సడన్‌గా నీకు మంచిబుద్ధి పోతుంది. విశ్వాసపరులకు మరణం ఎక్కడ ఉంది. మీకు గురువు పట్ల సజీవమైన విశ్వాసం ఉంది అనుకోండి, ఈ శరీరం చనిపోయి మీరు ఇంకో శరీరంలో ఉన్నా మీ విశ్వాసమే మిమ్మల్ని గురువు దగ్గరకు తీసుకొనిపోతుంది. అందుచేత విశ్వాసపరులకు మరణం లేదు. మీకు భక్తి దీర్ఘంగా ఉండాలి, విశ్వాసం దీర్ఘంగా ఉండాలి, ప్రేమ దీర్ఘంగా ఉండాలి. భక్తిలేనివారు భక్తులను ఎప్పడు అవమానపరుద్దాము అని కనిపెట్టుకొని ఉంటారు. భక్తి దీర్ఘంగా లేకపోతే వారు అవమానపరచినప్పడు మీ భక్తి చెదిరిపోతుంది. భక్తి దీర్ఘంగా లేకపోతే బాహ్య సంఘటనలకు చెదిరిపోయి జారిపోతుంది. గురువు అంటే వాడు ఏదో బోధ చెప్పేసి వదిలేయడు. వాడు ఏ స్థితిని పొందాడో ఆ స్థానంలోనికి మిమ్మల్ని తీసుకొని పోయేవరకు ఆయన మిమ్మల్ని విడిచిపెట్టడు. అయితే మీకు దీర్ఘమైన విశ్వాసం ఉండాలి. లోకంలో మీకు ఏమైనా అవమానాలు వచ్చినా కంగారు పడకండి. మిమ్మల్ని అవమానించటానికి మీరు ఎప్పడు దొరుకుతారా అని కొంతమంది చూస్తూ ఉంటారు, అది దుష్టుల లక్షణం, భక్తిహీనుల లక్షణం. శ్వాసపోయినా విశ్వాసం పోకూడదు అని మన పురాణాలలో చెపుతారు.

ప్రారబ్దాన్ని బట్టి మీకు సుఖాలు వస్తాయి, దుఃఖాలు వస్తాయి. సుఖం వచ్చినప్పడు పొంగిపోవద్దు, దుఃఖం వచ్చినప్పడు కుంగిపోవద్దు. గౌరవం వచ్చినా, అగౌరవం వచ్చినా వాటిని చూసి వికారం తెచ్చుకోవద్దు, మీ మనస్సును సమానంగా ఉంచుకోవటానికి ప్రయత్నం చేయండి. మనకు మంచిరోజులు వచ్చినా, చెడ్డరోజులు వచ్చినా అవి అలాగే ఉంటాయని అనుకోవద్దు. మన శరీరం స్మశానంకు వెళ్ళేలోపు రోజులు ఎన్ని రకాలుగా మారతాయో చెప్పలేము. ఇవన్నీ నిజంకాదు. మీ అదృష్టం మాయ, దురదృష్టం మాయ. సంపద అంతా ఈశ్వరుడిదే. నీ దేహప్రారబ్దాన్ని బట్టి కొంత నీకు కేటాయిస్తాడు. ఒకోసారి ఇస్తూ ఉంటాడు, ఒకోసారి లాగేసుకొంటాడు, ఇవన్నీ మాయ గొడవలు, వీటిని చూసి వికారం తెచ్చుకోవద్దు. వాటిని చూసి వికారం పొందితే మీ మనస్సు బాహ్యముఖానికి పోతుంది కాని అంతర్ముఖం అవ్వదు. మనస్సు అంతర్ముఖమేతే కాని అది ఆత్మాకారం చెందదు. ఓ అరుణాచలేశ్వరుడా! నేను అహంకారం అనే పిడికిలిలో పడి ఉన్నాను. ఈ పిడికిలిలో నుండి నువ్వు విడిపించకపోతే ఇంక విడిపించటానికి ఎవరికి సాధ్యమవుతుంది. ఈ అహంకారం అనే పిడికిలిలో నుండి నన్ను బయటకు తీసుకొని రా అన్నారు భగవాన్. అంటే కొంతమంది ఈ దేహమే సర్వస్వం అనుకొంటారు, ఆ బుద్ధిని ముందు పోగొట్టు అదీ భగవాన్ చెప్పేది. రాముడు ఒక ఋషి

దగ్గరకు చూడటానికి వెళతాడు. ఆయన స్వయంగా పరమాత్ముడు అయినప్పటికీ సత్పురుషుల పట్ల ఆయనకు ఉన్న గౌరవం చూడండి. ఆ ఋషి ఏమి చెప్పాడు అంటే నా టైము అయిపోయింది, నిన్ను చూడటానికి ఈ శరీరం నిలబడి ఉంది. ఫలానా చోట శబరి ఉంది, నీ కోసం ఎదురు చూస్తోంది, శబరికి దర్శనం ఇవ్వమని చెప్పి ప్రాణం విడిచిపెట్టేసాడు. శబరికి అటువంటి గౌరవం ఎందుకు వచ్చింది అంటే గొప్పదయగల అంతఃకరణం. శబరికి పెళ్ళి చేయటానికి ముహూర్తం పెట్టారు. రెండు రోజులకు పెళ్ళి అనగా మేకలను, గొర్రెలను తీసుకొని వచ్చి ఇంటి దగ్గర కట్టేసారు. ఎందుకు మేకలను, గొర్రెలను తీసుకొని వచ్చారు అని శబరి అడిగితే నీ పెళ్ళి కదా వీటిని చంపి ఆ మాంసం వండిపెడతారు అని చెప్పారు. నా పెళ్ళి ఏమిటి? ఆ జంతువులను చంపటం ఏమిటి? అని శబరి అక్కడ నుండి పారిపోయింది, అంత దయగల హృదయం ఆమెది. ఆమె అదృష్టం ఏమిటి అంటే అలా పారిపోయి వెళ్ళి మాతంగ మహర్షి చేతిలో పడింది. మాతంగమహర్షి ఆవిడకు మంచి ట్రైనింగు ఇచ్చాడు. మన ప్రారబ్ధాన్ని బట్టే బంధువులు, స్నేహితులు దొరుకుతారు. శబరితో మాతంగ మహర్షి ఏమన్నాడు అంటే ఇంతకాలం నాకు సేవ చేసావు, నీలోని ప్రేమను, హృదయంలో ఉన్న దయను సేవరూపంలో చూపించావు, నేను రేపు వెళ్ళిపోతున్నాను అని చెప్పాడు. అయితే నన్ను కూడా తీసుకొనిపొండి అని శబరి చెప్పింది. శబరీ నేను ఎక్కడకు వెళ్ళిపోతున్నానో చెప్పమంటావా, ఏ ఇద్దరం కలిసి అక్కడకు ప్రయాణం చేయలేము శబరీ అన్నాడు. అక్కడకు ఒంటరిగానే ప్రయాణం చెయ్యాలి. నేను నీకు గురువునేకాని నాకంటే నువ్వే ఎక్కువ అదృష్టవంతురాలవు. భగవంతుడు నీ దగ్గరకు రాముడి రూపంలో వస్తాడు, నువ్వు ఆశ్రమం విడిచిపెట్టకు, ఇక్కడే ఉండు, రాముడు నీ దగ్గరకు వచ్చి నిన్ను తరింపచేస్తాడు, అది నీ అదృష్టం అని చెప్పాడు. ఇక్కడ శిష్యురాలికి ఉన్న వైభవం గురువుకి లేదు, ఎవరి పుణ్యం వారిదే. మనం ఎక్కడో ఒకచోట పుట్టి, ఈ శరీరం ద్వారా సాధన చేసి మనం కొన్ని దుర్వాసనలు పోగొట్టుకోవచ్చు, కాని పుట్టుకతోటే దుర్విషయాలు ఎలా ఉంటాయో నీకు తెలియదు శబరి, ఇంక నీకు సాధన ఏల? నువ్వు రాముడిని చూడటం కాదమ్మా, రాముడిచేత చూడబడతావు శబరీ అని చెప్పాడు. రాముడిచేత చూడబడింది, శబరి పని పూర్తి అయిపోయింది. రాముడు నిర్గుణుడు, సగుణుడు కూడా. పైకి మంచి గుణాలతో మనకు కనిపిస్తాడు, లోపల గుణాలకు అతీతంగా ఉంటాడు. ఎందుకు అలా ఉంటాడు అంటే ఆ మంచి గుణాలను మనకు చూపిస్తూ, గుణాలు లేని చోటుకి మనలను మోసుకొనిపోతాడు, వాడు రాముడు. నాకు రామాయణంలో జటాయువు అంటే బాగా ఇష్టం. ఎందుచేతనంటే ఏమీ స్వార్థం లేకుండా ప్రాణం ఇచ్చేసింది.

రాముడి కార్యంలో జటాయువుకు ఏమీ స్వార్థం లేదు. అందుచేత దశరధుడికి లేని భాగ్యం జటాయువుకు కలిగింది. రాముడు కట్టెలు పేర్చి, జటాయువును ఆ కట్టెల మీద పెట్టి ఆయన చేతులతో నిప్పు పెట్టాడు, ఇంకేం కావాలి, అదీ జటాయువు యొక్క భాగ్యం. మహర్షులు, మహాత్ములు, పెద్ద పెద్ద తపస్సులు చేసినవారు ఏ లోకానికి వెళుతున్నారో ఓ జటాయువు నువ్వు కూడా అక్కడకు వెళ్ళు, ఇది రాముడి ఆజ్ఞ అని చెప్పాడు. ఈ శరీరం చనిపోయిన తరువాత జ్ఞాపకాల గురించి చెపుతున్నాను. నాకు రోజూ చేతికి గడియారం పెట్టుకొనే అలవాటు. కాని ఈ రోజు గడియారం పెట్టుకోవటం మర్చిపోయాను. అయినా గడియారం పెట్టుకొనే అలవాటు ఉంది కదా అందుచేత చేతివంక చూసుకొంటున్నాను. అలాగే మనం ఈ శరీరంలో కొన్ని సంవత్సరాలు ఉంటాము కదా చనిపోయిన తరువాత నా శరీరం ఏది, ఎక్కడికి వెళ్ళిపోయింది అని అలా చూసుకొంటూ ఉంటాము. ఆ శరీరం ఇంకరాదు, ఆ శరీరానికి మనకు ఎట్టి సంబంధం లేదు అని మనస్సులో నిర్ధారణ అయ్యాక ఇంక పాత శరీరం గొడవ వదిలేస్తాము. రాముడు ఏమన్నాడు అంటే హనుమంతా నీవు పాపరహితుడవు, నీ అతఃకరణం ఎంత శుద్ధిగా ఉంది, ఎంత నిర్మలంగా ఉంది, నీ అతఃకరణం అంత నిర్మలంగా ఉన్నప్పుడు ఆత్మసుఖం నీకు అందకుండా ఎలా ఉంటుంది. అందుతుంది అని చెప్పటంలేదు, ఆత్మసుఖం నీకు అందకుండా ఎలా ఉంటుంది అంటున్నాడు. ఒకవేళ నాకు ఆత్మసుఖం వద్దు అన్నా వచ్చి నీ మీద పడుతుంది అని చెప్పటం. ఎంత అందంగా చెపుతున్నాడో చూడండి. ఇప్పుడు మనం ఏదైతే నేను, నేను అంటున్నామో ఆ నేను నేను కాదు. దేహంతోటి, మనస్సుతోటి, ఇంద్రియాలతోటి సంబంధం లేకుండా స్వతంత్రంగా ఒక నేను మన హృదయంలో ఉంది. అదే నిజమైన నేను. శరీరం చనిపోయినప్పుడు ఈ శరీరాన్ని స్మశానానికి తీసుకొనివెళ్ళి కాల్చేస్తారు. ఈ శరీరం పోయినప్పుడు నేను పోవాలికదా, మరి శరీరం పోయినప్పుడు నేను పోకుండా ఉన్నాను ఏమిటి అంటే చనిపోయేది నేను కాదు, దేనికైతే చావులేదో, ఏదైతే మన హృదయంలో స్వతంత్రంగా ఉందో అదే నేను అని ఆయనకు మరణానుభవంలో స్ఫురించింది. ఇవి వట్టిమాటలు కాదు, ఏదో పుస్తకాలు చదివితే వచ్చేది కాదు, అది ఈశ్వరుని దయ. మరణానుభవం ద్వారా మృత్యువుతో సంబంధం లేని స్థితికి ఎదిగి వెళ్ళాడు. టీచింగ్ ఎలా ఉండాలి అంటే స్కూలులో, కాలేజీలో మాష్టార్లు పాఠాలు చెపుతారు కదా, నువ్వు అలా చెప్పకు, తల్లి తన పిల్లలను దగ్గర కూర్చోబెట్టుకొని, ఎంతో సన్నిహితంగా ఉంటూ ఎలా బోధిస్తుందో నువ్వు సబ్జక్టు చెప్పేటప్పుడు అలా చెప్పాలి అని శాస్త్రం చెపుతోంది.